జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
శుక్రవారం
09 01 2026
సంపుటి 1 సంచిక 49
పేజీలు : 04
RNI : TGTEL/25/A4195



రిపోర్టర్లకు ఆహ్వానం..

జర్నలిజంలో సత్తా చాటేందుకు సరైన వేదిక కోసం ఎదురుచూస్తున్నారా? అయితే.. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతో పాటు GHMC పరిధిలో డివిజన్ల వారీగా విలేకరులకు ఇదే జ్వాల దశ దినపత్రిక ఆహ్వానం.

అర్హతలు:
- ఫీల్డ్లో తిరిగి వార్తలు సేకరించే సామర్థ్యం
- సమాజ సమస్యలను నేరుగా వెలికి తీసే ధైర్యం
- నిజాన్ని నిర్భయంగా రాయగల నిబద్ధత

అనుభవం ఉన్న వారితో పాటు కొత్తగా జర్నలిజం రంగంలోకి రావాలనుకునే ఔత్సాహికులకు అవకాశం ఇవ్వడానికి జ్వాల దశ సిద్ధంగా ఉంది.

రిపోర్టర్‌గా పనిచేయాలనుకునే అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం బ్యూరో ఇంచార్జ్‌ను సంప్రదించవచ్చు. . (వాట్సాప్‌లో సంప్రదించండి)

7337 54 6647
9848 28 8850

జ్వాల దశ నిజం.. నిర్భయంగా..




## కేసీఆర్ ను కలిసిన మంత్రులు సీతక్క, సురేఖ

**దశ, హైదరాబాద్:** రాష్ట్ర దేవదాయ ధర్మదాయ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్ & మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి సీతక్క గురువారం ఎర్రవెల్లి నివాసంలో ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ ని మర్యాదపూర్వకంగా కలిసారు. ఇంటికి వచ్చిన కేసీఆర్ సాదర ఆహ్వానం పలికారు. అతిధి మర్యాదలతో, పసుపు కుంకుమలు చీర, తాంబూలాలతో ఆడబిడ్డలకు సంప్రదాయ సత్కారం చేసారు. మరికొద్ది రోజుల్లో, మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం కానున్న సందర్భంగా, జాతరను సందర్శించాల్సిందిగా కోరుతూ కేసీఆర్ ను ప్రభుత్వం తరపున మంత్రులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా, శాలువాకప్పి ఆహ్వాన పత్రికను అందజేసారు. కేసీఆర్ దంపతులతో మంత్రులు, కాసేపు పరస్పర యోగక్షేమాలు, ఇష్టాగోష్టి అనంతరం మంత్రులు తిరుగు ప్రయాణం అయ్యారు.




## కార్పొరేషన్‌గా నల్గొండ అసెంబ్లీ ఆమోదం

**దశ, నల్గొండ:** తెలంగాణ శాసనసభ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ, అభివృద్ధిలో భాగంగా జిల్లా కేంద్రమైన నల్లగొండను మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో నల్లగొండ పట్టణ ముఖచిత్రం పూర్తిగా మారనుంది. నల్లగొండ పట్టణం శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సాధారణంగా ఒక పట్టణాన్ని కార్పొరేషన్‌గా గుర్తించడానికి రూ. 20 కోట్ల వార్షిక ఆదాయం, 2 లక్షల జనాభా ప్రాతిపదికగా ఉంటుంది.అయితే నల్లగొండ పట్టణం ఇప్పటికే రూ. 40 కోట్ల వార్షిక ఆదాయంతో పాటు 2.5 లక్షల జనాభాను కలిగి ఉండటంతో అప్‌గ్రేడ్ ప్రక్రియ సులభతరమైంది. ఒకప్పుడు కేవలం రూ. 10 వేల బడ్జెట్‌తో ప్రారంభమైన ఈ పట్టణం.. నేడు రియల్ ఎస్టేట్, వాణిజ్య రంగాల్లో దూసుకుపోతోంది. కార్పొరేషన్‌గా

..మిగతా 4వ పేజీలో →

## టాప్ గేర్లో రియల్ ఎస్టేట్

- నగరాల్లో ఇళ్ల ధరలు సగటున 19 శాతం వరకు పెరుగుదల
- వర్చువల్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్‌ఫ్రాంక్ ఇండియా



**దశ, హైదరాబాద్:** దేశంలోని 8 ప్రధాన నగరాల్లో చూస్తే హౌసింగ్ సేల్స్ (ఇళ్లు లేదా ఫ్లాట్ల విక్రయాలు) గతేడాది 3.48 లక్షల యూనిట్లుగా ఉన్నాయి. ఇది అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే స్వల్పంగా ఒక శాతం తగ్గిందని చెప్పొచ్చు. అయితే ఇదే సమయంలో ఈ ప్రధాన నగరాల్లో ఇళ్ల ధరలు సగటున 19 శాతం వరకు పెరిగినట్లు పేర్కొంది. బుధవారం రోజు వర్చువల్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్‌ఫ్రాంక్ ఇండియా ఈ డేటా విడుదల చేసింది. ఇక్కడ ప్రధానంగా హోం లోన్ వడ్డీ రేట్లు తగ్గడం సహా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండటం, ద్రవ్యోల్బణం తగ్గుతుండటం వంటివి హౌసింగ్ డిమాండ్‌ను స్థిరంగా ఉంచేందుకు దోహదం చేసినట్లు తెలిపింది. ఈ 8 ప్రధాన నగరాలు చూస్తే ఢిల్లీ NCR, ముంబై, బెంగళూరు, పుణె, హైదరాబాద్, అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కతా ఉన్నాయి. ఇక్కడ ప్రధాన నగరాల్లో హైదరాబాద్‌లోనే సేల్స్ కాస్త ఎక్కువగా పెరిగాయి. ఇక్కడ 2025 సంవత్సరంలో మొత్తం ఇళ్ల విక్రయాలు 4 శాతం పెరిగి 38,403 యూనిట్లకు చేరుకున్నాయి. ఇదే సమయంలో ఇళ్లు లేదా ఫ్లాట్స్ ధరలు కూడా 13 శాతం వరకు పెరిగి చదరపు

..మిగతా 4వ పేజీలో →



# వద్దు వద్దు చైనీస్ మాంజా...!

### చైనీస్ మాంజాపై హైదరాబాద్ పోలీసుల కొరడా

### రూ. 1.24 కోట్ల విలువైన నిషేధిత మాంజా స్వాధీనం



**దశ, హైద్రాబాద్:** సంక్రాంతి పండుగ వేళ పర్యావరణానికి, పక్షులకు హాని కలిగించే నిషేధిత చైనీస్ మాంజా (నైలాన్/సింథటిక్ దారం) విక్రయాలను అరికట్టేందుకు హైదరాబాద్ నగర పోలీసులు విస్తృత చర్యలు చేపట్టారు. నగర కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పెద్ద ఎత్తున నిషేధిత మాంజాను స్వాధీనం చేసుకున్నారు. చైనా మాంజాపై ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ మాట్లాడుతూ.. "సంక్రాంతి అంటేనే పతంగుల పండుగ, ఆనందాల హేళ. అయితే, మన సంతోషం మరొకరి ప్రాణానికి ముప్పుగా పరిణమించకూడదు. పర్యావరణానికి, మనుషుల ప్రాణాలకు హాని కలిగించే 'చైనీస్ మాంజా'పై ప్రభుత్వం సంపూర్ణ నిషేధం విధించింది. నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ కొందరు గుట్టుచప్పుడు కాకుండా వీటిని విక్రయిస్తున్నారు. నగరంలో ఎవరైనా చైనా మాంజాను విక్రయించినా, గోదాముల్లో నిల్వ చేసినా, అక్రమ రవాణాకు పాల్పడినా ఉపేక్షించే ప్రసక్తే లేదు. నిబంధనలు అతిక్రమిస్తే తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తాం," అని హెచ్చరించారు. దుకాణాల్లో తనిఖీలు ముమ్మరం చేయడంతో వ్యాపారులు ఆన్‌లైన్ బాట పట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈకామర్స్ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా వేదికగా సాగే క్రయవిక్రయాలపై 24 గంటల పాటు ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ఆన్‌లైన్‌లో మాంజా కొనుగోలు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్లాస్టిక్, గాజు పెంకులు, మెటాలిక్ కోటింగ్ ఉండే ఈ మాంజా వల్ల పిల్లలకు విద్యుత్ షాక్ కొట్టే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి సంప్రదాయ నూలు దారాలనే ప్రోత్సహించాలని కోరారు. ఎవరైనా మాంజా విక్రయిస్తే 'డయల్ 100' లేదా వాట్సాప్ నెంబర్ 94906 16555 కి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## 'బీజేపీని కట్టడి చేశాం'




**దశ, హైదరాబాద్:** 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు గెలుచుకుని ఉంటే రాజ్యాంగాన్నే మార్చివేసేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. మెజారిటీ ఉందన్న కారణంతో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తే అంగీకరించేది లేదని ఆయన స్పష్టం చేశారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పేదలపై కక్షతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఉపాధి హామీ నిబంధనల మార్పు ముసుగులో పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. మెజారిటీ ఉందన్న అహంకారంతో చట్టసభలను వినియోగించి పేదలను అణిచివేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాల్సిన సమయం ఇదేనని ఆయన పిలుపునిచ్చారు. ఈ పథకంతో ఎన్నో

..మిగతా 4వ పేజీలో →

## 32 కమిటీలతో కవిత పార్టీ

### స్వతంత్ర రాజకీయ శక్తిగా మార్చే దిశగా వేగంగా అడుగులు

### తెలంగాణ సమగ్ర అభివృద్ధికి రోడ్‌మ్యాప్ రూపొందించే రాజకీయ పార్టీగా జాగృతి



**దశ, హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన సంస్థను స్వతంత్ర రాజకీయ శక్తిగా మార్చే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి ఎజెండా కమిటీ సభ్యులతో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం ఒక సాంస్కృతిక సంస్థగా కాకుండా, తెలంగాణ సమగ్ర అభివృద్ధికి రోడ్‌మ్యాప్ రూపొందించే రాజకీయ పార్టీగా జాగృతి రూపాంతరం చెందబోతోందని ఆమె స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత పాలించిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వైఫల్యాలను అధ్యయనం చేయడానికి కవిత ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే ప్రాథమిక నినాదంతో పాటు మొత్తం 32 కీలక అంశాలపై ఈ కమిటీలు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నాయి. ప్రజల

..మిగతా 4వ పేజీలో →

## 20న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్




- బీఎల్‌వోల ద్వారా క్షేత్రస్థాయిలో వివరాల పరిశీలన
- కలెక్టర్లకు ఈసీ దిశానిర్దేశం..
- అన్ని స్థానాల 'పై చేయి' సాధించేలా కసరత్తులు ముమ్మరం

దశ, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. గతేడాది డిసెంబర్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ).. ఇప్పుడు పట్టణ పోరుపై దృష్టి సారించింది. జనవరి 20వ తేదీ నాటికి రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో.. దానికి సంబంధించి ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ఖరారు చేసింది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు చివరి తేదీ జనవరి 12 అని తెలిపారు. అదే రోజున ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని మొదట ఆదేశించారు. టీ పోల్ యాప్‌లో, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను జనవరి 13వ తేదీన అప్‌లోడ్ చేయాలి. జనవరి 16వ తేదీన ఫోటోలతో కూడిన ఓటర్ల తుది జాబితా ప్రచురించనున్నారు. వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల వివరాలను కూడా ఆరోజే వెల్లడిస్తారు. ఇక జనవరి 20వ తేదీన మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.2019 నాటి ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకుని.. బీఎల్‌వోల ద్వారా క్షేత్రస్థాయిలో వివరాల పరిశీలన జరుగుతోంది. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని సిద్ధం చేయాలని కలెక్టర్లను ఈసీ ఆదేశించింది. మున్సిపల్ ఎన్నికలు

..మిగతా 4వ పేజీలో →

## రంగారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం

### రోడ్డు ప్రమాదంలో నలుగురు విద్యార్థులు మృతి



**దశ, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లాలో తీవ్ర విషాద సంఘటన చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో నలుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మీర్జాగూడలో ఓ స్పోర్ట్స్ కారు చెట్టును ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు ఐబీఎస్, ఐసీఎఫ్ఏఐ కాలేజీలకు చెందిన

..మిగతా 4వ పేజీలో →

**మృతుల వివరాలు..**

1) కర్ణాయల సుమిత్ (తండ్రి: వినయ్ కుమార్), వయసు సుమారు 20 సంవత్సరాలు. ఐబీఎస్ కాలేజీలో బీబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. నివాసం: ఫ్లాట్ నెం. డీ84, వెస్ట్రన్ మెడోస్, కొకపేట, నార్సింగి.
2) శ్రీ నిఖిల్ (తండ్రి: దివంగత విజయ్), వయసు సుమారు 20 సంవత్సరాలు. ఐబీఎస్ కాలేజీలో బీబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. నివాసం: ఫ్లాట్ నెం. 105, మై అబోడ్స్, మంచిరేవుల, నార్సింగి.
3) బాల్మూరి రోహిత్ (తండ్రి: విద్యాసాగర్ రావు), వయసు సుమారు 18 సంవత్సరాలు. ఎమ్‌జీఐటీ కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. నివాసం: పౌలోమీ అపార్ట్‌మెంట్, కొకపేట, రాజపుష్పా రెగాడియా సమీపంలో.
4) దేవాల సూర్య తేజ (తండ్రి: అరుణ్ కుమార్), వయసు సుమారు 20 సంవత్సరాలు. ఐబీఎస్ కాలేజీలో బీబీఏ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. నివాసం: మంచిర్యాల జిల్లా. గాయపడిన విద్యార్థిని: సుంకరి నక్షత్ర (తండ్రి: రవీంద్ర), వయసు సుమారు 20 సంవత్సరాలు. ఐబీఎస్ కాలేజీలో బీబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్సై

**దశ, వరంగల్ :** రాష్ట్రంలో ప్రతి రోజూ ఏదో ఒక చోట ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడుతున్నారు. గురువారం వరంగల్ కేయూసీ సబ్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీకాంత్ ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇటీవల ఒక కేసులో పట్టుబడ్డ వ్యక్తి తనపై వెంటనే చార్జ్‌షీట్ నమోదు చేసి పట్టుకున్న వాహనాన్ని, మొబైల్ ఫోన్‌ను తనకు అప్పగించాలని ప్రైవేట్ డ్రైవర్ ద్వారా ఎస్సైను సంప్రదించాడు. దీంతో లంచం డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. గురువారం కేయూ జంక్షన్ వద్ద రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి ప్రైవేట్ డ్రైవర్‌ను, ఎస్సైను పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టు ఎదుట హాజరు పరిచారు.

# ‘బీజేపీని కట్టడి చేశాం’

మొదటి పేజీ తరువాయి

విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ఆయన అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నం చేసిందని ఆయన మండిపడ్డారు. అందుకే గత ఎన్నికల్లో 400 సీట్లను లక్ష్యంగా పెట్టుకున్నారని ఆయన అన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రజలను అప్రమత్తం చేయడంతో బీజేపీ 240 సీట్ల వద్ద ఆగిపోయిందని ఆయన పేర్కొన్నారు. దీనితో రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన వాయిదా పడిందని ఆయన అన్నారు. ఓట్లను తొలగించేందుకు ఎస్ఐఆర్ తీసుకువచ్చారని, దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.పేదలపై కక్షతో మహాత్మగాంధీ పేరు ఉన్న పథకానికి పేరు మార్చారని మండిపడ్డారు. రూల్స్ పేరుతో పథకానికి శాశ్వతంగా సమాధి కట్టేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫైర్ అయ్యారు. అధికారం ఉందని మోదీ ఇష్టారీతిన పాలిస్తామంటే అంగీకరించేది లేదని రేవంత్ రెడ్డి అన్నారు. మెజార్టీ ఉంది కదా అని పేదలను అణచివేస్తామంటూ కాంగ్రెస్ చూస్తూ ఊరుకోబోదని వార్నింగ్ ఇచ్చారు. ఈ పథకం ప్రవేశ పెట్టిన తర్వాత చాలా మార్పులు వచ్చాయని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. గత ఎన్నికల్లో బీజేపీ నేతలు ప్రచారం చేసినట్టుగా 400 సీట్లు వచ్చి ఉంటే మాత్రం ఈపాటికి రాజ్యాంగాన్ని మార్చేసేవారని ఎద్దేవా చేశారు. కార్పొరేట్ సంస్థలకు లొంగిపోయి పేదలకు అన్యాయం చేస్తున్నారని దీన్ని గమనించే బీజేపీకి ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచారని చెప్పారు. రాష్ట్రాల్లో ఓడిపోతామని గ్రహించి ప్రతిపక్షాల ఓట్లు తొలగించే కుట్రకు కూడా వెనుకాడటం లేదని అన్నారు. దేశంలో బడా కంపెనీలకు మేలు చేసి ప్రజలతో వెట్టిచాకిరీ రోజులు తిరిగి తీసుకొచ్చేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. చేశారని వాటిని రాష్ట్రపతికి అందజేస్తామని తెలిపారు.

# కార్పొరేషన్‌గా నల్గొండ

మొదటి పేజీ తరువాయి

మారడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధుల రాక పెరగడమే కాకుండా అధునాతన మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఇదే సమావేశంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తన నియోజకవర్గ సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. నార్కట్ పల్లి మండలంలోని అమ్మనబోల్ గ్రామాన్ని కొత్త మండల కేంద్రంగా ప్రకటించాలని, అలాగే నకిరేకల్ పట్టణాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించే అవకాశం ఉంది.మరోవైపు, తెలంగాణ శాసనమండలి కార్యకలాపాలు ముగిశాయి. స్పీకర్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశాల్లో మున్సిపల్ సవరణ బిల్లుతో పాటు మరో కీలక నిర్ణయానికి మండలి ఆమోద ముద్ర వేసింది. తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ సేవలను గౌరవిస్తూ.. ఆయన కుమారుడికి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం కల్పించే బిల్లును డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టగా సభ్యులందరూ మద్దతు తెలిపారు.

# 32 కమిటీలతో కవిత పార్టీ

మొదటి పేజీ తరువాయి

ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ అభివృద్ధి బ్లూప్రింట్‌ను సిద్ధం చేయడమే ఈ కమిటీల ప్రధాన బాధ్యత. కేవలం ప్రాంతీయ పార్టీగానే కాకుండా, దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీల రాజ్యాంగాలను అధ్యయనం చేసి, జాగృతి కోసం ఒక సరికొత్త , అత్యంత ప్రజాస్వామ్యబద్ధమైన రాజ్యాంగాన్ని రూపొందించాలని కవిత నిర్ణయించారు. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం, పారదర్శకత ఉండేలా నిపుణుల కమిటీ ఈ ముసాయిదాను సిద్ధం చేస్తోంది. ఇది రాజకీయాల్లో కొత్త ఒరవడికి నాంది పలుకుతుందని ఆమె భావిస్తున్నారు. కమిటీలు ఈనెల 17వ తేదీలోకా తమ నివేదికలను వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్ నేతృత్వంలోని స్టీరింగ్ కమిటీకి సమర్పించాల్సి ఉంటుంది. ఆ నివేదికల ఆధారంగా రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి, పార్టీ అధికారిక ప్రకటన , భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. క్షేత్రస్థాయి వాస్తవాల ఆధారంగానే తమ రాజకీయ ప్రయాణం ఉంటుందని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, ప్రజల గొంతుకగా నిలిచే మరో శక్తి అవసరమని జాగృతి భావిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ ‘జాగృతి’ రాజకీయ ప్రస్థానం రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

# టాప్ గేర్లో రియల్ ఎస్టేట్

మొదటి పేజీ తరువాయి

అడుగుకు సగటు ధర రూ. 6,721 గా ఉంది. రెండో అర్ధభాగంలో అంటే జులై డిసెంబర్ సమయంలో హౌసింగ్ సేల్స్ హైదరాబాద్ నగరంలో 19,355 గా ఉండగా.. ఇది అంతకుముందు సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే 5 శాతం ఎక్కువ.కొత్త ఇళ్ల సప్లై విషయానికి వస్తే 2025లో హైదరాబాద్‌లో ఇది 40,737 యూనిట్లుగా ఉండగా.. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 7 శాతం తగ్గింది. ఇక 2025లో అన్‌సోల్డ్ ఇన్వెంటరీ అంటే అమ్ముడుపోని ఇళ్లు లేదా ఫ్లాట్ల సంఖ్య హైదరాబాద్‌లోనే 54,878 యూనిట్లుగా ఉండటం గమనార్హం. అంటే ఇక్కడ డిమాండ్‌కు మించి కొత్త ఇళ్ల సప్లై ఉండటమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. హైదరాబాద్‌లో ప్రధానంగా మౌలిక వసతుల కల్పన, ఉద్యోగాల సృష్టిలో దూసుకెళ్తుండటం వల్ల రియల్ ఎస్టేట్ కూడా వృద్ధి చెందుతున్నట్లు నైట్ ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్ తెలిపింది.ముంబైలో హౌసింగ్ సేల్స్ ఒక శాతం పెరిగి 97,188 యూనిట్లుగా ఉంది. ఇక్కడ సగటున ఇళ్ల ధరలు 7 శాతం పెరిగి చదరపు అడుగుకు రూ. 8,856 గా ఉంది. బెంగళూరులో ఇళ్ల విక్రయాలు స్థిరంగా 55,373 యూనిట్లుగా ఉంది. ఇళ్ల ధరలు సగటున 12 శాతం వరకు పెరిగి చ.అడుగుకు రూ. 7,388 గా ఉంది. పుణె, ఢిల్లీ NCR, కోల్‌కతాలోనూ ఇళ్ల అమ్మకాలు కాస్త తగ్గుముఖం పట్టాయి.

# 20న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్

మొదటి పేజీ తరువాయి

నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సౌకర్యాలపైనా కలెక్టర్లకు ఈసీ దిశానిర్దేశం చేసింది. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సిబ్బంది నియామకం, రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించి.. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించాలని ఎన్నికల కమిషన్ సూచించింది. మున్సిపల్ ఎన్నికలపై అధికార పార్టీ ప్రత్యేక గురి పెట్టింది. పంచాయతీ ఎన్నికలలో వచ్చిన ఫలితాలను మున్సిపల్ ఎన్నికల్లో పునరావృతం కాకుండా అధికార పార్టీ ఆచితూచి అడుగులు వేస్తుంది.మున్సిపాలిటీ ఎన్నికల్లో అన్ని స్థానాల ’ పైచేయి’ సాధించేలా క్షేత్రస్థాయి కసరత్తులు ముమ్మరం చేసింది. ఇప్పటికే పార్టీ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా మున్సిపాలిటీ వారిగా సర్వే చేయించి పార్టీ బలాలు, బలహీనతలు పై దృష్టిసారించింది.సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల క్రితం పీసీసీ చీఫ్ తో ప్రత్యేక సమావేశం నిర్వహించి...జిల్లా ఇన్చార్జి మంత్రులతో పాటు నియోజకవర్గ ఎమ్మెల్యేలు పార్టీ ఇంచార్జిల కు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. జిల్లా లో ఉన్న మున్సిపాలిటీలో అన్ని స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకునేలా ఎత్తుగడలు వేయాలని ఎక్కడ కూడా ప్రతిపక్ష పార్టీకి అవకాశం ఇవ్వొద్దు అంటూ అంతర్గతంగా నేతలకు దిశా నిర్దేశం చేశారు. మున్సిపాలిటీ ఎన్నికల పై ప్రధాన రాజకీయ పార్టీలు సైతం కసరత్తు ముమ్మరం చేశాయి.మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి




# ఘనంగా శివ శివాని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ మెగా ఫెస్ట్ ప్రారంభం

**దశ, హైదరాబాద్ :** శివ శివాని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ 27వ సమన్వయ్ 2026 రెండు రోజుల మెగా ఫెస్ట్ ఉల్లాసంగా ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ నటుడు శుభలేఖ సుధాకర్, గౌరవ అతిథిగా శ్రీధర్ నందిరాజు, వైస్ ప్రెసిడెంట్ అండ్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డా. శైలేష్ సంపతి, వైస్ ప్రెసిడెంట్ దీపికా సంపతి హాజరయ్యారు. వారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్తాజ్ ఆఫ్ సమన్వయ్ ట్రోఫీని ఆవిష్కరించారు. రెండు రోజుల వేడుకల ముఖ్య ఉద్దేశం విద్యార్థుల్లో నిర్వహణ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సమన్వయము మొదలగునవి నేర్చుకునే అవకాశం ఈ మేనేజ్మెంట్ ఫెస్ట్ ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ మేనేజ్మెంట్ ఫెస్ట్ లో 3000 మంది విద్యార్థులు ఐదు రాష్ట్రాల నుంచి సుమారు వంద కళాశాలల నుంచి పాల్గొన్నారు. సుమారు 13 రకాల ఈవెంట్స్ నిర్వహణలో మొదటి రోజు ఫార్మల్ ఈవెంట్స్, ఇన్ఫార్మల్ ఈవెంట్స్ మొదటి రౌండ్స్ జరిగాయి. రెండో రోజు అన్ని ఈవెంట్స్ ఫైనల్ రౌండ్స్ జరుగుతాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ అండ్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డా. శైలేష్ సంపతి, వైస్ ప్రెసిడెంట్ దీపికా సంపతి, ఇంచార్జి డైరెక్టర్ డా. ఎన్ఆర్ కెఎస్ చక్రవర్తి, సమన్వయ్ కోఆర్డినేటర్లు డా. పవన్ పటేల్, మాధవ్ మూర్తి , డా. పీ గౌరీ కుసుమ , డా. కామేశ్వరి, కార్తీక్, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# గెస్ట్ హౌస్‌లో వ్యభిచారం



**దశ, ఎల్బీనగర్:** వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పతిధిలోని కమ్మగూడలోని హర్షిత గెస్ట్ హౌజ్ లో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఒకరిని అరెస్టు చేయగా, ఇద్దరు మహిళలను రెస్క్యూ హోమ్ కు తరలించారు. నిర్వాహకుడు పరారీలో ఉన్నాడు.బాధిత ఇద్దరు యువతులు ఢిల్లీ,ఇతర రాష్టానికి చెందిన వారిగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలు... కమ్మగూడ లోని హర్షిత గెస్ట్ హౌస్ లో వ్యభిచారం నడుస్తుందని నమ్మదగ్గ సమాచారం రాగా, సెర్చ్ పర్మిషన్ తీసుకొని బుధవారం వనస్థలిపురం పోలీసులు దాడి చేశారు. గెస్ట్ హౌస్ లో తనిఖీ చేయగా ఇద్దరు మహిళలతోపాట రిసెప్షనిస్టు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రిసెప్షనిస్ట్ గా పని చేస్తున్న మచిలీపట్టణానికి షేక్ ఖలీల్ తండ్రి ఇస్మాయిల్ (27)ను అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించినట్లు, ఇద్దరి మహిళలను రెస్క్యూ హోమ్ కు తరలించినట్లు సీఐ మహేశ్ గౌడ్ తెలిపారు. ఆర్గనైజర్ ఆదిత్య చౌదరి పరారీలో ఉన్నట్లు, చట్ట వ్యతిరేక కార్యాకలాపాలు నిర్వహిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# గాంధీ భవన్ లో టీపీసీసీ సమావేశం

**దశ, హైదరాబాద్:** గాంధీ భవన్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) విస్తృత స్థాయి సమావేశం టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, అజారుద్దీన్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, ఏఐసీసీ నాయకులు ప్రవీణ్ చక్రవర్తి, ప్రభుత్వ సలహాదారులు కేశవ రావు, వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్ తదితరులు, హాజరయ్యారు. ఈ సమావేశంలో పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పీఏసీ) సభ్యులు, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రటరీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# రోజువారీ వ్యాయామం అలవాటు చేసుకోవాలి : ఎస్పీ శరత్ చంద్ర పవార్

**దశ, నల్లగొండ:** ఆరోగ్యవంతమైన యువతే సమాజ భవిష్యత్‌కు బలమని నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డులో ఎల్‌వీ కుమార్ పెట్రోల్ బంక్ పక్కన, కళానికేతన్ భవనంపై ఏర్పాటు చేసిన నూతన జిమ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రోజువారీ వ్యాయామం అలవాటు చేసుకోవాలని సూచించారు. యువత మత్తు పదార్థాల నుండి దూరంగా ఉండేందుకు క్రీడలు, వ్యాయామం దోహద పడుతుందని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు



**దశ, హైదరాబాద్:** తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నుండి పలువురు నేతలు బీఆర్ఎస్ లో చేరారు. కొల్లాపూర్ నియోజకవర్గం, చిన్నంబావి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ రంజిత్, వార్డు మెంబర్స్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కేటీఆర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, బీ ఆ ర్ ఎ స్ జనరల్ సెక్రటరీ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రావుల చంద్ర శేఖర్ రెడ్డి, రంగినేని అభిలాష్, అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి, ఆంజనేయ గౌడ్, ఇంతియాజ్ అలీ, కురువ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# దొడ్ల మిల్క్ మేనేజర్‌పై కత్తి తో దాడి.. పరిస్థితి విషమం



**దశ, మేడ్చల్ :** బీఆర్ఎస్ పాలనలో పదేండ్లుగా ప్రశాంతంగా ఉన్న రాష్ట్రం నేడు పట్టపగలే హత్యలు, దోపిడీలతో ప్రజలకు శాంతి లేదు. భద్రత అసలే లేదనే వాదన వినిపిస్తున్నది. నిత్యం ఏదో ఒకచోట హత్యలు జరుగుతుంటే ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. తాజాగా మేడ్చల్‌లో దొడ్ల మిల్క్ మేనేజర్ శ్రీనివాస్ పై కిరణ్ అనే పాల వ్యాపారి తల్వార్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స కోసం ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఉర్దూ వర్సిటీ విస్తరణకు సిద్ధం

**దశ, హైదరాబాద్:** గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం విస్తరణకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ జారీ చేసిన షోకాజ్ నోటీసుపై స్పందించింది. మణికొండ జాగీర్‌లోని 50 ఎకరాల భూమిలో భవిష్యత్ అవసరాల కోసం అకడమిక్ భవనాలు, హాస్టళ్లు నిర్మించనున్నట్లు విశ్వవిద్యాలయం తెలిపింది. ఈ పనులకు సంబంధించిన సమగ్ర నివేదిక సిద్ధమవుతోందని, నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతామని.. అందుకు రెండు నెలల సమయం గడువు ఇవ్వాలని సమాధానం ఇచ్చింది.గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీ విస్తరణపై ముందడుగు పడింది. వర్సిటీ క్యాంపస్ విస్తరణ, భవిష్యత్ అవసరాలపై యాజమాన్యం దృష్టి సారించింది. వర్సిటీకి కేటాయించిన భూములపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ జారీ చేసిన షోకాజ్ నోటీసుకు వర్సిటీ సానుకూలంగా స్పందించింది. వర్సిటీకి కేటాయించిన భూముల్లో... మణికొండ జాగీర్ పరిధిలోని 50 ఎకరాల భూమిని ఎందుకు వెనక్కి తీసుకోకూడదో తెలపాలంటూ... రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కొన్ని రోజుల క్రితం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.దీనిపై వర్సిటీ తాజాగా స్పందిస్తూ... ఆ స్థలంలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను వెల్లడించింది.

# ప్రణయ్ పరువు హత్య నిందితుడికి బెయిల్



**దశ, నల్గొండ:** తెలంగాణలో సంచలనం సృష్టించిన మిర్యాలగూడ ప్రణయ్ పరువు హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న నిందితుడు శ్రవణ్‌కుమార్‌కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ. 25 వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు అదే మొత్తానికి రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. బెయిల్‌పై ఉన్న సమయంలో ఎలాంటి నేరాలకు పాల్పడరాదని స్పష్టం చేసింది.2025 మార్చిలో నల్గొండ జిల్లా కోర్టు ఈ కేసులో శ్రవణ్‌కుమార్‌కు జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ శ్రవణ్ హైకోర్టును ఆశ్రయించారు. తన అప్పీల్ విచారణ పూర్తయ్యే వరకు బెయిల్ మంజూరు చేయాలని మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న ధర్మాసనం, నిందితుడి వయసు, జైలు జీవితాన్ని పరిగణనలోకి తీసుకుని బెయిల్‌కు అనుమతించింది.2018 సెప్టెంబర్ 14న మిర్యాలగూడలో పెరుమాళ్ల ప్రణయ్‌ను ఆయన మామ మారుతీరావు సుపారీ గ్యాంగ్‌తో దారుణంగా హత్య చేయించారు. తన కుమార్తె అమృత, ప్రణయ్‌ను కులాంతర వివాహం చేసుకోవడమే ఇందుకు కారణం. అప్పట్లో ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.ఈ కేసులో సుదీర్ఘ విచారణ జరిపిన నల్గొండ కోర్టు, ప్రణయ్‌ను హత్య చేసిన సుభాశ్ శర్మకు (ఏ 2) ఉరిశిక్ష, రూ. 15వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. అలాగే, అమృత బాబాయి అయిన శ్రవణ్‌కుమార్‌తో పాటు మిగిలిన నిందితులకు జీవిత ఖైదు, రూ. 10వేల జరిమానాను ఖరారు. ఇప్పుడు శ్రవణ్‌కు బెయిల్ లభించడం చర్చనీయాంశంగా మారింది.

# రంగారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం

మొదటి పేజీ తరువాయి

విద్యార్థులు చనిపోయారు. కోకాపేట్‌లో బర్త్‌డే పార్టీ చేసుకుని ఫ్రెండ్‌ను డ్రాప్ చేసి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో మొత్తం 5 మంది ఉన్నట్లు తెలుస్తోంది. నలుగురు యువకులు చనిపోగా.. నక్షత్ర అనే యువతికి తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నక్షత్రను చికిత్స నిమిత్తం దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. నలుగురు యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

Printed and Published by B. Kalpana on behalf of Kalpana Publications.
Printed & Published at Flat No. 101, Sri Heights Apartment, Shilpi Colony, Pasumamula Road, Pedda Amberpet, Rangareddy- 50105. Editor: B. KALPANA, RNI Reg No. TGTEL/25/A4195.